క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్



సబ్‌కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న నూతన మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి

ఆదోనిటౌన్: పట్టణ మున్సిపల్ కమిషనర్‌గా కె.రామచంద్రారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మర్యాద పూర్వకంగా సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ, చైర్‌పర్సన్ శాంతను కలిశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగులు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్‌కు పూలమాలలు, బొకేలు అందజేసి సన్మానించారు. అనంతరం సెక్షన్ల వారీగా అధికారులతో సమీక్షించారు. ఆదోని మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిద్దామని, అందుకు ప్రతి ఒక్కరూ తమవంతు సహాయ సహకారాలు అందించాలని ఉద్యోగులను కోరారు.

రైతులకు అండగా ఉంటాం



బాధిత రైతులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు: నియోజకవర్గంలోని రైతులకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో రైతులు దస్తగిరి, ఉచ్చప్ప, ఉసేని, నరసింహులు, నారాయణకు చెందిన గడ్డివాములు గురువారం రాత్రి ప్రమాదవశాత్తు కాలిపోయాయి. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వై.ప్రదీప్‌రెడ్డి శుక్రవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధిత రైతులకు రూ. 30 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయనతో పాటు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, దొడ్డిమేకల సర్పంచ్ చంద్రశేఖర్, రవిచంద్రారెడ్డి ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యం, వాహనంతో ఎస్‌ఐ కృష్ణమూర్తి

మంత్రాలయం: మండల కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న మద్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసినట్లు మాధవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం మంత్రాలయం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద వాహనాల తనిఖీలు చేశారు. టాటా ఏస్ వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. 15 బాక్సుల్లో తరలిస్తున్న 90 ఎంఎల్ కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మంచినీరు వృథా



ట్యాంకర్ నీటిని వృథా చేస్తున్న దృశ్యం

ఆదోనిటౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయం పక్కనే పంప్‌హౌస్‌లో ఫిల్టర్ చేసిన నీటిని ట్యాంకర్ నుంచి నీరు వృథా పోతున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదు. ట్యాంకర్ వాల్వ్‌ను ఓపెన్ చేసి వదిలేయడంతో వృథాపోతున్న నీటితో దారిలో వెళ్తున్న వారు కాళ్లు, చేతులు శుభ్రం చేసుకుంటున్నారు. ఈ విషయంపై ట్రాక్టర్ డ్రైవర్‌ను ప్రశ్నించగా ట్యాంకర్ లోపలి భాగం తుప్పు పట్టిందని నిర్లక్ష్యంగా సమాధానమివ్వడం విశేషం. నీటి కొరతతో పట్టణ శివారు ప్రాంతాలు అల్లాడిపోతుంటే ఇక్కడ ఇలా వృథా చేయడం తగదని పలువురు పేర్కొన్నారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మేనేజర్

పెద్దకడబూరు: బ్యాంకింగ్ సర్వీసెస్‌పై అవగాహన కలిగి ఉండాలని పెద్దకడబూరు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రంగప్ప అన్నారు. ఆర్‌బీఐ నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ఆదర్శ పాఠశాలలో శుక్రవారం బ్యాంకింగ్ లావాదేవీలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఆరుగురి అరెస్ట్

తుగ్గలి: మండల పరిధిలోని రామాపురం వద్ద పొట్టేళ్ల పందేలు ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు శుక్రవారం జొన్నగిరి ఎస్‌ఐ రామాంజినేయులు తెలిపారు. గ్రామ సమీపంలో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో బొలవానిపల్లికి చెందిన ముగ్గురు, పామిడి మండలం నెమళ్లపల్లికి చెందిన ఇద్దరు, గుంతకల్లు మండలం ములకలపెంటకు చెందిన ఒకరి అదుపులోకి తీసుకున్నామన్నారు. రెండు పొట్టేళ్లు, రూ.5 వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

పేద విద్యార్థులకు.. కార్పొరేట్ విద్య

- ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితం
- వచ్చే విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల
- విద్యాహక్కు చట్టం కింద ఒకటో తరగతిలో ప్రవేశాలు
- దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 14న ఆఖరు



పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: పేద విద్యార్థులకు కూడా కార్పొరేట్ విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఇందుకు విద్యాహక్కు చట్టాన్ని పక్కాగా అమలు చే సేందుకు చర్యలు చేపట్టింది. విద్యా సంవత్సరం ప్రారంభంలో నోటిఫికేషన్ విడుదల చేయడమే కాకుండా, వచ్చే విద్యా సంవత్సరానికి ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే నోటిఫికేషన్ విడుదల చేసింది. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాల్సి ఉంటుంది. ఎంపికైన విద్యార్థులను తప్పకుండా అయా పాఠశాలల్లో చేర్చుకోవాలి. ఒక వేళ ప్రవేశాలను నిరాకరించిన యాజమాన్యాలపై విద్యాశాఖ చర్యలు తీసుకోనుంది.

పక్కాగా అమలు చేయాలి

ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి ఉచిత విద్యనందించేందుకు 2022–23 విద్యా సంవత్సరంలోనే ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆ విద్యా సంవత్సరం 45 మంది విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటే 2023–24లో 547 మంది సద్వినియోగం చేసుకున్నారు. ఎంపికై న విద్యార్థులు మండలంలోని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశం పొందారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న అనాథలు, హెచ్‌ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ,ఓసీ వర్గాలకు విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లు కేటాయించారు. అధికారులు స్వీకరించిన దరఖాస్తులను రిజర్వేషన్లు నిబంధనల మేరకు అభ్యర్థులను ఎంపిక చేసి సీట్లను కేటాయించారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను డీఈవోల ద్వారా అయా పాఠశాలలకు పంపించింది. అలాగే ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులు/ సంరక్షకులకు సెల్‌ఫోన్ల ద్వారా సమాచరం ఇచ్చి ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేసింది. విద్యా హక్కు చట్టం–2009 ప్రకారం ఏటా ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఇవ్వాలని ఉన్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుతం ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఇచ్చే అంశాన్ని సరీయస్‌గా తీసుకుని అమలు చేస్తున్నారు.

2024–25 విద్యా సంవత్సరానికి..

వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాలకు ఈ విద్యా సంవత్సరంలోనే నోటిఫికేషన్ విడుదల చేసింది. ఐబీ/ ఐసీఎస్ఈ/ సీబీఎస్ఈ/ స్టేట్ సిలబస్‌లు అమలవుతున్న ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను ఒకటో తరగతి విద్యార్థులకు కేటాయించాల్సి ఉంటుంది. గత నెల 23వ తేదీ నుంచి స్టూడెంట్ రిజిస్ట్రేషన్ విండో ఆన్ ది పోర్టల్‌లో దరఖాస్తూ చేసుకోవడానికి అవకాశం కల్పించింది.

షెడ్యూల్ ఇలా ..

- గత నెల 23 నుంచి ఈనెల 14వ తేదీ వరకు స్టూడెంట్ రిజిస్ట్రేషన్ విండో ఆన్ ది పోర్టల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఏప్రిల్ 1న లాటరీ ద్వారా మొదటి విడత జాబితా ప్రచురణ
- ఏప్రిల్ 2 నుంచి 10వ తేదీ వరకు అయా పాఠశాలల్లో స్టూడెంట్ అడ్మిషన్ల ధ్రువీకరణ
- ఏప్రిల్ 15న లాటరీ ద్వారా రెండో విడత జాబితా ప్రచురణ
- అదే నెల 16 నుంచి 23వ తేదీ వరకు అయా పాఠశాలల్లో స్టూడెంట్ అడ్మిషన్ల ధ్రువీకరణ

సద్వినియోగం చేసుకోవాలి



విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయింపును ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తుంది. పేద విద్యార్థులకు ఇది మంచి అవకాశం. సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే దరఖాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైంది. దరఖాస్తూ చేయాలనుకునే వారు గ్రామ వారు సచివాలయాల్లో గానీ, లేదా ఆన్‌లైన్ సెంటర్‌లో కాని దరఖాస్తు చేసుకోవచ్చు. cse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

– శ్రీనివాసులు, ఎంఈఓ–2 ఆదోని

పేదల సొంతింటి కల సాకారం

మంత్రాలయం: ఇళ్లు లేని నిరుపేదలు ఉండకూడదనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి నిరుపేదల సొంతింటి కలను సాకారం చేశారని టీటీడీ పాలక మండలి సభ్యుడు వై. సీతారామిరెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రాలయం సచివాలయం కార్యాలయంలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. మంత్రాలయంలో 540 మందికి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేసినట్లు తెలిపారు. పేదల స్థలాలకు సక్వహక్కులు కల్పించేందుకు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లిన శివస్వాములు



ఇరుముడిలతో శ్రీశైలానికి భయలుదేరుతున్న శివస్వాములు

పెద్దకడబూరు: మండల పరిధిలోని పీకలబెట్ట గ్రామంలో శివమాల ధరించిన 17మంది భక్తులు శుక్రవారం శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. స్థానిక ఆలయంలో తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడి కట్టుకున్నారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ గ్రామ వీధుల మీదుగా పాదయాత్రగా బయలుదేరారు.



కౌతాళం: పరీక్ష హాలు నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

కౌతాళం: ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు మొదటి లాంగ్వేజ్‌గా తెలుగు, ఉర్దూ, కన్నడ సబ్జెక్ట్‌ల పరీక్షలు రాశారు. 168 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 24 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ సంతోష్‌కుమార్ తెలిపారు.

కోసిగిలో 126 మంది గైర్హాజరు

కోసిగి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 254 మంది విద్యార్థులకు గాను 112, నారాయణ కళాశాలలో 240 మందికి గాను 14 మంది పరీక్షలకు గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్‌లు శ్రీనివాసులు, ఉదయభార్గవ్ తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో మాస్ కాపియింగ్ జరగకుండా ఆయా కళాశాలల్లో స్క్వాడ్‌లు ఏర్పాటు చేశారు.

ఘనంగా ఎద్దుల గిరక బండి పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కోసిగి: కోసిగిలో రేణుక ఎల్లమ్మ జాతరను పురస్కరించుకుని మండల స్థాయి ఎద్దుల బండి గిరక పోటీలను నిర్వహించారు. శుక్రవారం స్థానిక భూగేని చెరువు సమీపంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి పూజలు చేసి పోటీలను ప్రారంభించారు. రైతులను ఉత్సాహపరిచే విధంగా పోటీలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి 11 జతల ఎద్దులు పోటీల్లో పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ. 21వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు, చతుర్ధ బహుమతి రూ.5వేలు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఎస్‌ఐ సతీష్ కుమార్ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు మంగమ్మ, నాయకులు బుళ్లి నరసింహులు, నాడుగేని వీరేష, నాడుగేని రాముడు, శివారెడ్డి, లోకారెడ్డి, నిర్వాహకులు శ్రీరాములు, లక్ష్మీరెడ్డి, నరసింహులు, వీరేష్, రాజు, బాబు, యువరాజు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇంటర్మీడియెట్ పరీక్షలు





పరీక్ష కేంద్రం వద్ద క్యూలో విద్యార్థులు,కోసిగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకు మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం పరీక్షలు జరగనున్నాయి. తమ పిల్లలు పరీక్షలు రాయడానికి తల్లిదండ్రులు అయా సెంటర్లకు తీసుకొచ్చారు. పట్టణంలో విద్యార్థులు పరీక్షలు వ్రాయడానికి 7 సెంటర్లను అధికారులు ఏర్పాటు చేశారు. అయా సెంటర్లలో మొదటి సంవత్సరం విద్యార్థులు 2,592 మంది రాయాల్సి ఉండగా అందులో 82 మంది గైర్హాజరు కాగా 2,510 మంది పరీక్షకుహాజయర్యారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని ఎ– సెంటర్‌లో 337 మందికి గాను 322 మంది హాజరయ్యారు. బి– సెంటర్‌లో 357 మందికి గాను 348 మంది రాశారు. సాయి జూనియర్ కళాశాలలో 386 మందికి గాను 374 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. బాలాజీ జూనియర్ కళాశాలలో 334 మందికి ఉండగా 325 మంది విద్యార్థులు హాజరయ్యారు. నారాయణ జూనియర్ కళాశాలలో 389 మందికి గాను 376 మంది పరీక్ష రాశారు. అక్షరశ్రీ జూనియర్ కళాశాలలో 410 మందికి 395 మంది హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 376 మందిలో 367 మంది పరీక్ష రాశారని అయా సెంటర్ల ఎగ్జామినేషన్ చీఫ్ అధికారులు లలిత, విశ్వనాథ్, సంజన్న తెలిపారు.

ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు



టోకన్ల కోసం బారులు తీరిన రోగులు

కౌతాళం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు చేస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా అన్నారు. శుక్రవారం కౌతాళం మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో వచ్చి వివిధ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద రూపాయి ఖర్చు లేకుండా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం అందిస్తారని ఎంపీడీఓ తెలిపారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐక్య ఉద్యమాలతోనే హక్కుల సాధన



సంఘీభావం ప్రకటిస్తున్న ఎమ్మార్పీఎఫ్ సభ్యులు

ఆదోనిరూరల్: ముస్లింల సమస్యలు పరిష్కారం కావాలన్నా, హక్కులు సాధించాలన్నా ఐక్యమత్యంతో ఉద్యమించాల్సిన అవసరం ఉందని ముస్లిమ్స్ రైట్ ప్రొటెక్షన్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు (ఎమ్మార్పీఎఫ్) డాక్టర్ షేక్ మహబూబ్‌బాషా పిలుపునిచ్చారు. గురువారం రాత్రి పట్టణంలోని షాహి జామియా (పెద్ద) మసీదు వెనక భాగంలో మసుదియా ఉన్నత పాఠశాల మైదానంలో ముస్లింల గర్జనను నిర్వహించారు. ఇందుకు హైదరాబాద్, కర్నూలు నగరాలకు చెందిన ముస్లిం నాయకులు హాజరై తమ సందేశాన్ని వినిపించారు. అలాగే పట్టణంతో పాటు కౌతాళం, కోసిగి మండలాల గ్రామాల్లోని ముస్లింలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రాష్ట్రంలో 66 వేల ఎకరాల వక్ఫ్ బోర్డు భూములు ఉన్నాయని, జిల్లాలో 33 వేల ఎకరాలు ఉన్నాయన్నారు. ముఫ్తీ అబ్దుల్ రహమాన్, సాజిదా సికిందోర్, సయ్యద్ రోషన్ అలీ, తాటిపాడు బాబు, అఫ్జల్‌సాహెబ్, సయ్యద్ ముర్తుజాఖాద్రి, ఎంఆర్‌పీఎఫ్ యూత్ నాయకులు సయ్యద్‌సోయాబ్ ఖాద్రి, ఆదోని పెద్ద మసీదు ప్రధాన ట్రస్టీ సాదీ రవూఫ్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత ముఖ్యం



మాట్లాడుతున్న రామచంద్రరావు

ఆదోనిసెంట్రల్: ప్రతి పౌరుడు ఆర్థికంగా పురోగతి సాధించాలంటే ఆర్థిక అక్షరాస్యత ముఖ్యమైనదని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ఎస్.ఆర్.రామచంద్రరావు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు–2024 ముగింపు కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ముందుగా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌బీఐ 2016 నుంచి ప్రతి సంవత్సరం ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాన్ని నిర్వహించడం ద్వారా దేశవ్యాప్తంగా ప్రజల్లో ఒక నిర్దిష్ట అంశంపై ఆర్థిక విద్య సందేశాలను ప్రచారం చేస్తుందని చెప్పారు. జిల్లాలోని ప్రతి వ్యక్తికి ఎఫ్ఎల్‌డబ్ల్యూ మరియు ఆర్థిక అక్షరాస్యత సందేశాలను సమర్థవంతంగా వ్యాప్తి చేయడంలో ఆర్‌బీఐ, జిల్లా కలెక్టర్‌ల మద్దతు కోరుతూ జిల్లాలో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించాలని కోరారు. కెనరా బ్యాంక్ ఆదోని చీఫ్ మేనేజర్ వీరాంజనేయులు, బ్యాంకు అధికారులు అనిల్‌రెడ్డి, హరినాథ్, యు.నాగరాజు, ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్ శివుడు, సీఎఫ్‌యల్ ఆదోని, కోసిగి, ఎమ్మిగనూరు, ఆలూరు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

- ఉన్నత పాఠశాల, కస్తూర్బా విద్యాలయాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్
- పట్టణంలో పలు పోలింగ్ కేంద్రాల పరిశీలన

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న సబ్‌కలెక్టర్



ప్రశ్నలు వేసి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబడుతున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోనిరూరల్: పట్టణంలోని క్రాంతినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కస్తూర్బా బాలికల వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం తప్పకుండా విద్యార్థులకు అందించాలని నిర్వాహకులకు సూచించారు. పౌష్టికాహార పదార్థాలతో పాటుగా వంటకాలను రుచికరంగా వండి వడ్డించాలని చెప్పారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి బాగుందని హెచ్‌ఎంను అభినందించారు. అనంతరం పాఠశాలలో ప్రతి తరగతి గదిని పరిశీలించి ఉపాధ్యాయుల బోధనను గమనించారు. చిన్నారులతో ముచ్చటించి ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను సబ్‌కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. శంకర్‌నగర్, క్రాంతినగర్, గాంధీనగర్, లేబర్‌కాలనీ, కల్లుబావి, వైఎస్సార్ కాలనీల్లోనున్న పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ర్యాంపు, తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్ తదితర సదుపాయాలు పక్కాగా ఉండేటట్లు చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఠంచన్‌గా పింఛన్ల పంపిణీ



మరాఠీగేరిలో పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ రేణుక, వార్డు ఇన్‌చార్జి మమ్మత్తుస్వామి



బెడ్ పేషెంట్‌కు ఐరిష్ తీసుకుంటున్న వెల్ఫేర్ అసిస్టెంట్ నరసింహులు

ఆదోనిటౌన్: పట్టణంలో ఠంచన్‌గా పింఛన్ల పంపిణీ చేశారు. శుక్రవారం 42 వార్డుల పరిధిలో 600 మంది వలంటీర్లు తెల్లవారకముందే తలుపు తట్టి లబ్ధిదారులకు అందజేశారు. మొత్తం 17,399 మంది పింఛన్ దారులు ఉండగా, 70 శాతానికి పైగానే పంపిణీ చేశారు.

ఎస్ఎస్‌ట్యాంకును పూర్తిస్థాయిలో నింపాలి



ట్యాంకులో నీటి మట్టాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, ఎంఈ, డీఈలు

ఆదోనిటౌన్: తుంగభద్ర దిగువ కాలువ నీటితో బసాపురం ఎస్ఎస్ ట్యాంకును పూర్తిస్థాయిలో నింపాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తుంగభద్ర దిగువ కాలువ, సరఫరా అవుతున్న నీటి శాతం, ఎస్ఎస్ ట్యాంకులోకి పంపుతున్న నీటి వివరాలను ఎంఈ, డీఈలను అడిగి తెలుసుకున్నారు. పట్టణ వాసులకు వేసవిలో నీటి సమస్య లేకుండా చూడాలని చెప్పారు. కెనాల్‌లో నీటి ప్రవాహం తగ్గేలోగా చెరువును సామర్థ్యం మేరకు నింపాలని సూచించారు. ఎంఈ చలపతిరావు, డీఈ శ్రీనివాసనాయక్, ఏఈలు రాజశేఖర్ రెడ్డి, కృపాకర్ ఉన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని సిరాలదొడ్డి గ్రామంలో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో దస్తగిరికి చెందిన గుడిసె దగ్ధమైంది. చుట్టుపక్కల వారు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. అప్పటికే గుడిసె పూర్తిగా కాలిపోవడంతో ఇంట్లోని వస్తువులు, సామగ్రి బూడిదయ్యాయి. రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు దస్తగిరి వాపోయారు. కట్టుబట్టలతో రోడ్డున పడ్డామని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఎల్లమ్మ జాతరలో భక్తుల సందడి



భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం,



మిఠాయిలు కొనుగోలు చేస్తూ..



రంగుల రాట్నం వద్ద భక్తుల సందడి



గాజుల దుకాణాల్లో జోరుగా కొనుగోళ్లు

కోసిగి: కోసిగిలో రేణుక ఎల్లమ్మ జాతర రెండో రోజు శుక్రవారం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కుడుములు, గుగ్గిళ్లు, ఉప్పు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు ఉమేష్ గౌడ, మల్లికార్జున గౌడ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జాతరలో గాజులు, మిఠాయి అంగళ్లు, చిన్నారుల బొమ్మలు , రంగుల రాట్నాల వద్ద భక్తులతో రద్దీగా మారింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ సతీష్‌కుమార్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.